ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

3★★★ జిల్లా వార్తలు

శుక్రవారం 10 అక్టోబరు 2025

- తొలిరోజే ఆశావహులకు నిరాశ
- జిల్లాలో మొదటి, రెండు విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- జిల్లాలో 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీలు
- 260 సర్పంచ్, 2268 వార్డు సభ్యుల స్థానాలు
- రెండో, మూడో విడతల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు షెడ్యూల్
- ఎన్నికల నిర్వహణకు సిద్ధమైన అధికార యంత్రాంగం
- హైకోర్టు స్టేతో రిజర్వేషన్లపై సందిగ్ధం

ఎన్నికల పండుగకు బ్రేక్..



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పల్లె ఎన్నికల పండుగకు నామినేషన్ల తొలిరోజే బ్రేక్ పడింది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో రిజర్వేషన్లు ఖరారు, ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ జారీ చేయడంతో పల్లెల్లో రాజకీయాలు వేడెక్కాయి. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలివిడత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. రెండు రోజులుగా హైకోర్టులో జరుగుతున్న వాదనలు రిజర్వేషన్ల ఉత్కంఠతను నింపింది. చివరకు 42 శాతం బీసీ రిజర్వేషన్ల జీవో 9పై హైకోర్టు స్టే విధించడంతో ఆశావహుల్లో నిరాశ నింపింది. హైకోర్టు నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించడంతో స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్లేనా అనే సందిగ్ధత ఏర్పడింది. మరోవైపు నాలుగు వారాల తర్వాత బీసీ రిజర్వేషన్లు ఉంటాయా లేదా పాత రిజర్వేషన్లు ముందుకు వస్తాయా అనే చర్చలు మొదలయ్యాయి. గతంలో 23 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ వచ్చిన రిజర్వేషన్లతో స్థానిక సంస్థల్లో బీసీల ప్రాబల్యం పెరుగుతుందని భావించారు.

తుది తీర్పు తర్వాతే ముందుకు..

స్థానిక సంస్థల రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే విధించింది. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీకి సిద్ధపడ్డ అభ్యర్థులు హైకోర్టు తుది జడ్జిమెంట్ తర్వాతనే ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు. పరిస్థితులకు తగ్గట్టుగానే పోటీకి ఏర్పాట్లు చేసుకోవాలని చర్చించుకుంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఆశావహులు మద్దతు కూడగట్టుకునే పనిలో డబ్బులు ఖర్చు చేసి లబోదిబోమంటున్న వారున్నారు. రిజర్వేషన్లుమారి తమకు అనుకూలంగా లేకపోతే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 260 సర్పంచులు, 2268 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి. వీటి పరిధిలో జిల్లా గ్రామీణ ఓటర్లు 3లక్షల 53వేల 351మంది ఉన్నారు. ఇందులో పురుషులు 170772మంది, మహిళలు 182559 మంది ఉన్నారు. ఇప్పటికే 12జడ్పీటీసీ స్థానాల్లో ఎస్టీలకు ఒకటి, ఎస్సీలకు మూడు, బీసీలకు ఐదు, జనరల్ మూడు స్థానాలను కేటాయించారు. జడ్పీచైర్మన్ ఎస్సీ జనరల్‌కు రిజర్వ్‌చేశారు. 123 ఎంపీటీసీ స్థానాల్లో ఎస్టీలకు 7, ఎస్సీలకు 25, బీసీలకు 56, జనరల్ 35స్థానాలను కేటాయించారు. ఎంపీపీల రిజర్వే షన్లలో రుద్రంగి ఎస్టీజనరల్, ముస్తాబాద్ ఎస్సీ మహిళ, కోనరావుపేట ఎస్సీ జనరల్, వేములవాడ రూరల్ ఎస్సీ జనరల్, ఇల్లంతకుంట బీసీ మహిళ, బోయినపల్లి బీసీ మహిళ, గంభీరావుపేట, వేములవాడఅర్బన్, ఎల్లారెడ్డిపేట బీసీ జనరల్, ...

- మిగతా 6లో

తొలిరోజు మూడు నామినేషన్లు

సిరిసిల్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో తొలి రోజు గురువారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి అధికారులు నామినేషన్లను స్వీకరించారు. జిల్లాలో తొలి విడతలో ఏడు జడ్పీటీసీలు, 65ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణలో వేములవాడరూరల్, బోయినపల్లి జడ్పీటీసీ స్థానాలకు రెండు నామినేషన్లు వచ్చాయి. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట ఎంపీటీసీ స్థానానికి ఒక నామినేషన్ దాఖలైంది.

మద్యం దరఖాస్తులు 146

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైన్స్ టెండర్‌లకు ఇప్పటి వరకు 146 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. గురువారం జిల్లాలో గురువారం 20 దరఖాస్తులు దాఖలయ్యాయి. అంతకుముందు 126 దరఖాస్తులు రావడంతో మొత్తం 146 దరఖాస్తులు సమర్పించారు. ఇందులో అత్యధికంగా తంగళ్లపల్లి మండలంలోని సారంపల్లి వైన్స్‌కు 18 దరఖాస్తులు వచ్చాయి. ఇంకా 9రోజులు మాత్రమే గడువు ఉన్నప్పటికీ దరఖాస్తులు చివరలో అధికంగా వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ హరిత - బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిత

బోయినపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు. బోయినపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని విభాగాలు, వార్డులను పరిశీలించి, సిబ్బంది హాజరు వివరాలు, రిజిస్టర్, ఫార్మసీ తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వైద్యం కోసం ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లో అందించే సేవలపై అవగాహన కల్పించాలని, ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు.

పొగాకుతో కలిగే అనర్థాలపై అవగాహన పెంచాలి

- జిల్లా వైద్యాధికారి రజిత



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రజిత

ఇల్లంతకుంట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పొగాకు వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా వైద్యాధికారి రజిత సూచించారు. మండల కేంద్రంతో పాటు గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రులను గురువారం పరిశీలించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వాడటం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, హృదయ సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. ప్రభుత్వ నియమాల ప్రకారం విద్యాసంస్థలకు 100మీటర్ల దూరంలో పొగాకు, పాను దుకాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇమ్యునైజేషన్ అధికారి సంపత్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు రామకృష్ణ, అనిత, వైద్యాధికారులు జీవనజ్యోతి, కట్ట రమేష్, వీసీసీఎం మేనేజర్ నవీన, కవిత, భారతి, లక్ష్మి, సరిత, అనితలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోషణ్ మాసోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు తల్లులు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. చిరు ధాన్యాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, హంస, లావణ్య, వసంత, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

చేనేత, జౌళి శాఖ కార్యాలయాన్ని మార్చాలి



ఏవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌కు మార్చిన చేనేత జౌళి శాఖ కార్యాలయాన్ని యాథావిధిగా సిరిసిల్లకు మార్చాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)జిల్లా అధ్యక్షుడు కోడం రమణ అన్నారు. గురువారం చేనేత జౌళిశాఖ కార్యాలయాన్ని సిరిసిల్లకు మార్చాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు కలెక్టర్, చేనేత జౌళిశాఖ అధికారికి వినతి పత్రంను అందించారు. ఈ సందర్భంగా కోడం రమణ మాట్లాడారు. కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల పట్టణంలో స్థానిక బీవైనగర్‌లో కార్మికులందరికి అందుబాటులో చేనేత జౌళిశాఖ కార్యాలయం ఉండేదన్నారు. కొద్దిరోజుల క్రితం కలెక్టరేట్‌కు తరలించడం వల్ల కార్మికులు దూరప్రాంతంలో ఉన్న కలెక్టరేటుకు రావడానికి ఇబ్బంది అవుతుందన్నారు. కలెక్టరేట్ నుంచి తిరిగి సిరిసిల్లకు మార్చాలని గతంలో కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన కలెక్టర్ దృష్టికి మరోసారి సమస్యలను తీసుకెళ్లామని తెలిపారు. త్రిఫ్ట్ పథకానికి సంబంధించిన డబ్బులు కార్మికులకు పూర్తి స్థాయిలో రాలేవని మంత్రి దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి త్రిఫ్ట్‌కు సంబంధించిన డబ్బులు కార్మికుల ఖాతాలో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త త్రిఫ్ట్‌ను వెంటనే ప్రారంభించాలన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరలకు సంబంధించి పవర్‌లూం అనుబంధ రంగాల కార్మికులకు పది శాతం యారన్ సబ్సిడీని అందించాలని కార్మికుల పక్షాన కోరామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ నాయకులు సిరిసిల్ల సత్యం, గుండు రమేష్, బాస శ్రీధర్, ఉడుత రవి, ఎక్కల్‌దేవి జగదీష్, స్వర్గం శేఖర్, శ్రీనివాస్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర అందించడమే లక్ష్యం

- రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ఎం హరిత - ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హరిత

సిరిసిల్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర అందించడమే లక్ష్యమని కలెక్టర్ ఎం హరిత స్పష్టం చేశారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఖరీఫ్ సీజన్ 2025-26 ధాన్యం సేకరణపై పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, వ్యవసాయ శాఖ, రవాణా, మార్కెటింగ్, సహకార, ఐకేపీ, మెప్మా ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 2.11లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ఈ సీజన్లో దాదాపు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని తెలిపారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా గ్రామాల్లో వరి కోతలు మొదలు అయితే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. వెంటనే ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే రైతులకు ధాన్యం కేంద్రాలకు ఎలా తరలించాలి, తేమ శాతం వివరాలు తెలిపి టోకెన్లు ఇవ్వాలని ఆదేశించారు. సన్న ధాన్యాన్ని నిర్ధారించి, దాని వివరాలు కొనుగోలు కేంద్రాల బాధ్యులకు ఇవ్వాలని సూచించారు. ఐకేపీ, మెప్మా, పీఏసీఎస్, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ధాన్యం సేకరణ, రైతుల వివరాల నమోదు ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో ఇబ్బందులు తొలగించాలని సూచించారు. ధాన్యం సేకరణ, రవాణా, లారీలు ఇతర ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్పలేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ 2389, కామన్ రకానికి రూ.2369 నిర్ణయించిదని వెల్లడించారు. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ 500 అదనంగా ఇస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని సేకరించేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో 144, పీఏసీఎస్ 79, మెప్మా, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కలిపి 231 కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అందుబాటులో పరికరాలు..

జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. టార్పాలిన్లు 7592, తూకం వేసే యంత్రాలు 764, ప్యాడీ క్లీనర్లు 731, తేమ శాతం చూసే మెషిన్లు 603, గ్రైన్ కాలిపర్స్ 270ఇతర యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమీక్షలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్ డీసీఎస్‌వో చంద్రప్రకాష్, జిల్లా మేనేజర్ రజిత, డీఏవో అఫ్జల్ బేగం, డీఆర్డీవో శేషాద్రి, డీసీవో రామకృష్ణ, డీఎంవో ప్రకాష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ సెంటర్లను మహిళా సంఘాలకు ఇవ్వాలి



కలెక్టరేట్‌కు వచ్చిన మహిళా సంఘాల సభ్యులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాక్స్ నుంచి ఐకేపీ సెంటర్‌ను తిరిగి మహిళా సంఘాలకే ఇవ్వాలని గురువారం ఎల్లారెడ్డిపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సాబేరా మహిళా సంఘాల సభ్యులు, మహిళలతో కలసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాబేరా మాట్లాడుతూ మండల పరిధిలో మహిళా సంఘాల అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయన్నారు. ఐకేపీ సెంటర్ పాక్స్ ద్వారా నిర్వహించాలనే విధానంతో మహిళా సంఘాలు ఆర్థిక, సామాజికపరమైన ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాక్స్ నుంచి ఐకేపీ సెంటర్‌ను తిరిగి మహిళా సంఘాలకే ఇవ్వాలని వినతిపత్రం ద్వారా కలెక్టర్‌ను కోరామని పేర్కొన్నారు. కలెక్టర్ సానుకూల నిర్ణయం తీసుకొని స్వయం సహాయక మహిళా గ్రూపుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘాల సభ్యులు సంధ్య, ఉమరాణి, బార్గవి, పుష్ప, కవిత, నీలిమ, లత, సత్య, మంజుల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో ఆధునిక విద్యాభోదన..

- పెద్దలింగాపూర్ ప్రాథమిక పాఠశాలకు 'పీఎంశ్రీ' గుర్తింపు



పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థులు

6

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

ఇల్లంతకుంట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల నామినేషన్ కేంద్రానికి గురువారం చేరుకొని పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారులు వ్యవహరించాలని సూచించారు. పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ తదితరులు ఉన్నారు.

విస్తరిస్తున్న కరీంనగర్ డెయిరీ



- 16 జిల్లాల్లో 1,200 గ్రామాల నుంచి పాల సేకరణ
- లక్ష కుటుంబాల సంస్థగా సేవలు
- త్వరలో ఖమ్మం, భద్రాచలం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అమ్మకాలు
- హైదరాబాద్‌లో లక్ష లీటర్ల అమ్మకం లక్ష్యం
- ప్రత్యేక యాప్‌తో డోర్ డెలివరీ
- పాడి రైతుల సంక్షేమానికి పెద్దపీట
- కరీంనగర్ డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మూడు లక్షల లీటర్ల పాల సేకరణ లక్ష్యంతో కరీంనగర్ డెయిరీ 1200 గ్రామాల్లోని లక్ష పాడి రైతుల కుటుంబ సంస్థగా ఎదిగిందని, ఇప్పటికే 2.5 లక్షల పాలను సేకరిస్తూ రాష్ట్రంలోని 16 జిల్లాలలోని వినియోగ దారులకు స్వచ్ఛమైన, నాణ్యమైన పాలను, పాల ఉత్పత్తులను అందిస్తున్నదని డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్ రావు తెలిపారు. ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీ ప్రగతిని, పాడి రైతుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కరీంనగర్ డెయిరీ ప్రస్తుతం 16 జిల్లాల్లో పాలు సేకరిస్తూ పాలను, పాల ఉత్పత్తులను ఆయా జిల్లాల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నదన్నారు. త్వరలో ఖమ్మం, భద్రాచలం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోనూ అమ్మకాలను ప్రారంభిస్తామని తెలిపారు. హైదరాబాద్ మార్కెట్‌లో ప్రస్తుతం 60 వేల లీటర్ల పాలను విక్రయిస్తున్నామని, దీనిని లక్ష లీటర్లకు



కరీంనగర్ డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు

మిగతా 5వ పేజీలో

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అశోక్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గుర్రం అశోక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం బీవైనగర్ అమృత్‌లాల్ శుక్ల కార్మిక భవన్ ఆవరణలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ)రాష్ట్ర 5వ మహాసభ వాల్‌పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. ఈనెల 14, 15 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ)రాష్ట్ర 5వ మహాసభలు జరగనున్నాయన్నారు. మహాసభలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, మూడు సంవత్సరాలుగా యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టి ఆందోళనలు, పోరాటాలను సమీక్షించుకుంటామన్నారు. అదే విధంగా భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను కూడా రూపొందించుకోవడం ఉంటుందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని 5వ మహాసభలను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, సహాయకార్యదర్శులు సూరం పద్మ, శ్రీరాముల రమేష్‌చంద్ర, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కాసారపు శంకర్, సుల్తాన్ నర్సయ్య, రెడ్డిమల్ల రాజయ్య, ఏల్పుల బాలయ్య, బాబా కిషన్, శ్రీనివాస్, మల్లేశం, మమత, లక్ష్మి, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తగిలి కౌలు రైతు మృతి


సతీష్ (ఫైల్)

ఎండపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామంలో పంటను పందుల బెడద నుంచి కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగిలి గురువారం బింగి సతీష్ (35) అనే కౌలు రైతు మృతిచెందాడు. పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన కథనం ప్రకారం మారేడుపల్లి గ్రామానికి చెందిన బింగి సతీష్ భూములను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గురువారం ఉదయం సతీష్ తాను కౌలు చేస్తున్న పత్తికి మందు కొట్టాలని తన తండ్రితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. సతీష్ పొలానికి కొంతదూరంలో ద్విచక్ర వాహనాన్ని నిలిపి చేను వద్దకు బయల్దేరాడు. ఈక్రమంలో కోట కనుకయ్య అనే రైతు పొలం నుంచి వెళ్తుండగా పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగిలి సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కోట కనుకయ్య తన పొలం వద్దకు రాగా వైరుపై పడి మృతిచెందిన సతీష్ మృతదేహాన్ని చూసి మృతుడు తండ్రికి సమాచారం ఇచ్చి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ స్వామి పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ పందుల బెడద నుంచి పంటలను కాపాడుకోవడానికి సోలార్ వంటి ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాలని, విద్యుత్ తీగలు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

● రెండు నెలల్లో ముగ్గురి మృతి

మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామాల్లో విద్యుదాఘాతంతో రెండు నెలల వ్యవధిలో బొమ్మగాని తిరుపతి, లింగాల చిన్నయ్య, బింగి సతీష్ మృతిచెందారు. ఆయా గ్రామాల్లో విషాదం అలుముకుంది.

దుబాయిలో రోడ్డు ప్రమాదం

- చికిత్స పొందుతూ ముస్తఫానగర్ యువకుడు మృతి


శ్రీకాంత్(ఫైల్)

గంభీరావుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఊరిలో ఉపాధి లేక దుబాయి దేశానికి వెళ్లిన బడుగు జీవిని రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఈనెల 4న దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామానికి చెందిన యువకుడు దోమకొండ శ్రీకాంత్(26) అనే యువకుడు ఈనెల 7న మృతిచెందాడు. మృతివార్త గురువారం కుటుంబ సభ్యులకు తెలియడంతో కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. శ్రీకాంత్ ఆరు నెలల కిందట ఉపాధి నిమిత్తం దుబాయి దేశానికి వెళ్లాడు. ఈనెల 4న దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని అక్కడి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 7న చనిపోయాడు. యువకుడి మృతి వార్త అతని స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో విషాదం నెలకొంది. మృతుడికి తల్లిదండ్రులు చంద్రవ్వ, దేవయ్యలు ఉన్నారు. అధికారులు స్పందించి యువకుడి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకుల మృతి


శ్రీనివాస్ (ఫైల్)

మానకొండూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలో గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. మానకొండూర్ మండలం చెంజర్ల ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో సామంతుల శ్రీనివాస్ (35) అనే యువకుడు మృతి చెందాడు. శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనుల దృష్ట్యా కరీంనగర్‌కు వెళ్లాడు. నిజాయితీగూడెం గ్రామానికి తిరిగి వస్తుండగా చెంజర్ల గ్రామంలోని ఫ్లైఓవర్‌పై కారు ఢీకొనడంతో శ్రీనివాస్ ఫ్లైఓవర్ పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మంథనిరూరల్: మండలంలోని నాగెపల్లి-అడవిసోమన్‌పల్లి గ్రామాల సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగెపల్లి గ్రామానికి చెందిన ముక్కెర సమ్మయ్య (35) అనే యువకుడు మృతి చెందాడు. నాగెపల్లి నుంచి సమ్మయ్య పని నిమిత్తం అడవిసోమన్‌పల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బొలెరా వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు న్యాయం చేయాలని రాస్తారోకో నిర్వహించారు. మంథని ఎస్ఐ రమేష్ సంఘటన స్థలానికి వెళ్లి వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

సీఆర్‌పీఎఫ్ జవాన్ ఆత్మహత్య


రాజ్‌కుమార్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ బుధవారం సాయంత్రం బలవన్మరణానికి పాల్పడగా గురువారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పెరుమాండ్ల రాజ్‌కుమార్(38) సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా జార్ఖండ్ రాష్ట్రంలో పనిచేస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా ఇంటికి వచ్చిన రాజ్‌కుమార్ రెండు రోజుల పాటు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైనట్లు తెలుస్తోంది. బుధవా రం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సమయంలో ఆయన భార్య, కూతురు పుట్టింల్లో వెళ్లినట్లు సమాచారం. జవాన్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తన చావుకి కారణం ఎవరూ కాదని తనకు నిద్ర పట్టడం లేదని, అక్క, బావలు అమ్మనాన్నలను మంచిగా చూసుకోవాలని లేఖలో రాశారు. మృతుడు రాజ్‌కుమార్ తండ్రి భిక్షపతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రండి బాబూ.. రండి..

దరఖాస్తు చేసుకోండి..



● వైన్ షాపుల దరఖాస్తుల కోసం ఎక్సైజ్ అధికారుల ప్రచారం..

● రియల్‌ఎస్టేట్, గ్రానైట్, రైస్‌మిల్లర్లు, డాక్టర్స్, టీచర్స్, మెడికల్ వ్యాపారులకు మెస్సేజ్‌లు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపుల లైసెన్స్‌ల కోసం సెప్టెంబరు 26న ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. రెండు వారాలు గడిచినా ఎక్సైజ్ శాఖ, ప్రభుత్వం ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ఎక్సైజ్ అధికారులు ప్రచారంపై దృష్టి సారించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించిన ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు కొన్ని లక్ష్యాలను విధించినట్లు సమాచారం. 2023-25 ఎక్సైజ్ సంవత్సరంలో వైన్‌షాపులకు వచ్చిన దరఖాస్తులకు తగ్గకుండా అధికంగా దరఖాస్తులు రావాలని చెప్పినట్లు తెలిసింది. విస్తృతంగా ప్రచారం చేసి జిల్లాలలో పెద్ద పెద్ద వ్యాపారులను ప్రోత్సహించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎక్సైజ్ అధికారులు జిల్లావ్యాప్తంగా అన్ని ఉద్యోగ, వ్యాపార, కుల సంఘాల వాట్సప్ గ్రూపులకు వైన్ షాపుల నోటిఫి కేషన్ వివరాలు పంపిస్తున్నారు.

లాభాలను వివరిస్తూ..

స్థానిక ఎక్సైజ్ అధికారులు ఆయా వైన్‌షాపులలో గత రెండు ఏళ్లలో ఎన్నికోట్ల వ్యాపారం జరిగిందనే వివరాలను కూడా అందిస్తూ దరఖాస్తు చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నారు. నోటిఫికేషన్ జారీ అయిన తరువాత రెండు వారాల్లో (బుధవారం వరకు) కరీంనగర్ జిల్లాలోని 94 వైన్‌షాపులకు 64 దరఖాస్తులు మాత్రమే అందాయి. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 18న సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది.

వైన్ షాపుల లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు మందకొడిగా వస్తుండడంతో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాల వారీగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గ్రానైట్ వ్యాపారులు, మద్యం వ్యాపారులు, డాక్టర్స్, రైస్‌మిల్లర్లు, మెడికల్ వ్యాపారులు, ఇతర ఫైనాన్స్ ఎస్టాబ్లిషర్స్‌తో నేరుగా జిల్లా ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతున్నారు. 2023-25 ఎక్సైజ్ టెండర్ల సమయంలో ఇదే విధంగా రోజుకో కేటగిరీ వ్యాపారులతో స్థానిక ఎక్సైజ్ అధికారులు సమావేశం పెట్టి దరఖాస్తు చేసుకోవాలని ప్రోత్సహించే చర్యలు చేపట్టారు. ఈ సారి ఎన్నికల కోడ్ ఉన్నందున సమావేశాలు పెట్టకుండా ఫోన్‌లకు మెస్సేజ్‌లు పంపించి ప్రచారం చేస్తున్నారు.

మద్యం వ్యాపారంలో లాభాలు బాగా ఉంటాయని, ప్రభుత్వం లైసెన్స్ ఇస్తుంది కాబట్టి తాము అండగా ఉంటామని నచ్చజెబుతూ వ్యాపారులకు స్థానిక ఎక్సైజ్ అధికారులు అవగాహన కలిగిస్తున్నారు. వైన్‌షాపుల లైసెన్స్ కోసం దరఖాస్తుకు చెల్లించే మూడు లక్షల రూపాయలు నాన్ రిఫండబుల్ కావటంతో ఎన్ని దరఖాస్తులు వస్తే అంత ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశంతో ఎక్సైజ్ అధికారులు ఈ మేరకు ప్రచారం చేస్తున్నారు. రాబోయే ఎక్సైజ్ సంవత్సరంలో స్థానిక సంస్థల ఎన్నికలు చాలా ఉంటాయని, వ్యాపారం లాభసాటిగా ఉంటుందని ఎక్సైజ్ అధికారులు వారి మార్కెటింగ్ స్కిల్స్‌ను బోధిస్తున్నారు.

గత టెండర్ల సమయంలో దరఖాస్తుల ద్వారా 80.8 కోట్ల ఆదాయం

కరీంనగర్ జిల్లాలో 2023-25 ఎక్సైజ్ సంవత్సరంలో 94 వైన్ షాపులకు 4,040 దరఖాస్తులు రాగా ఒక్కో దరఖాస్తుకు రెండు లక్షల వంతున నాన్ రిఫండబుల్ చలాన్ రూపంలో ఎక్సైజ్‌శాఖకు 80.8 కోట్ల రూపాయలు ఆదాయం సమకూరింది. అంతకు ముందు 2021-23లో 94 వైన్‌షాపులకు 1,720 దరఖాస్తులు ద్వారా 34.4 కోట్ల రూపాయల ఆదాయం దరఖాస్తుల రూపంలో సమ కూరింది.



ప్రస్తుతం 2025-27 ఎక్సైజ్ సంవత్సరంలో వైన్ షాపుల దరఖాస్తు ఫీజును మూడు లక్షలకు పెంచారు. దీంతో కొత్తగా మద్యం వ్యాపా రంలోకి వచ్చే వారు కొంత ఆలోచనలో పడ్డారు. సింగిల్ దరఖాస్తు లతో లాభం ఉండదని, 10, 20 మందిగా గ్రూపులుగా ఏర్పడి తలా మూడు లక్షల పెట్టి దరఖాస్తులు వేయాలని యోచిస్తున్నారు.

ఇప్పటికే మద్యం వ్యాపారంలో ఉన్న వారు స్లీపింగ్ పార్ట్‌నర్లుగా పెట్టుబడితో ఆయా గ్రూపుల నుంచి వైన్‌షాపులకు దరఖాస్తులు చేసు కునేందుకు సిద్ధమవుతున్నారు. దరఖాస్తుల గడువు మరో వారం రోజులే ఉండడంతో డబ్బులు సమకూర్చు కుని చలాన్, డీడీలు చెల్లించి దగ్గర పెట్టుకుని వేచి చూస్తున్నారు. కరీంనగర్‌లో ప్రస్తుతం వైన్‌షాపులు, బార్లు నడుపుతున్న మద్యం వ్యాపారులు, వారి అనుచరులు, పార్ట్‌నర్‌లు ఇంకా దరఖాస్తులు చేసుకోలేదని సమాచారం. వీరంతా చివరి రెండు రోజుల్లో తాము దరఖాస్తుచేసేందుకు ప్రణాళికను రూపొందించుకుని ఎదురు చూస్తున్నట్లు తెలిసింది. 2023-25లో ఇదే విధంగా చివరి రెండు రోజుల్లో 50 శాతానికి పైగా దరఖాస్తులు అందాయి.

ఉమ్మడి జిల్లాలో 287 వైన్‌షాపులకు 264 దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో 2025-27 ఎక్సైజ్ సంవత్సరంలో 287 వైన్‌షాపులకు లైసెన్స్‌ల జారీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తూ సెప్టెంబరు 26న ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటి వరకు 92 వైన్‌షాపులకు 264 దరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్ జిల్లాలో 94 వైన్‌షాపులకు ఇప్పటి వరకు 64 దరఖాస్తులు వచ్చాయి. జగిత్యాల జిల్లాలో 71 వైన్‌షాపులకు 30, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 48 వైన్‌షాపులకు 146, పెద్దపల్లి జిల్లాలో 74 వైన్‌షాపులకు 24 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం 37 దరఖాస్తులు అందాయి.

యువకుడిపై హత్యాయత్నం

వేములవాడ క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని సాయినగర్ కాలనీలో బుధవారం అర్ధరాత్రి కొంపల్లి భానుప్రకాశ్(32) అనే యువకుడిపై హత్యాయత్నం జరిగింది. సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన కొంపల్లి భానుప్రకాశ్ తంగళ్లపల్లి కస్తూర్బా పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మద్యం సేవించి ఉన్న భానుప్రకాశ్ పరిచయం ఉన్న కలెక్టరేట్‌లో పనిచేసే వేములవాడలోని సాయినగర్‌లో ఉంటున్న ఓ మహిళ ఇంటికి ద్విచక్రవాహనంపై వచ్చాడు. అదే వీధిలో ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లి దావత్ కోసం మహిళ వద్ద డబ్బులు అడిగి తిరిగి వెళ్లేందుకు బయటకు వచ్చాడు. బయట బైక్ విషయమై పక్కింటి యువకుడితో గొడవ పడ్డాడు. ఈ గొడవలో భానుప్రకాశ్‌పై కత్తితో దాడి చేయడంతో కడుపులో, చేతులకు తీవ్రగాయాలై కిందపడ్డాడు. అడ్డువచ్చిన కాలనీ వాసులను బెదిరించారు. దాడిచేసిన యువకులు పోలీసులు వచ్చేసరికి పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గాయాలతో పడిపోయిన భానుప్రకాశ్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. భానుప్రకాశ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫైనాన్స్ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సైదాపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని గొడిశాల గ్రామానికి చెందిన గిన్నారపు దుర్గయ్య అనే వ్యక్తి హోమ్‌లోన్ ఫైనాన్స్ సిబ్బంది వేధింపులు భరించలేక బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం దుర్గయ్య ఆటో నడుపుకొని జీవిస్తాడు. హుస్నాబాద్‌లోని ఓ హోమ్ లోన్ ఫైనాన్స్‌లో తన ఇల్లు తాకట్టు పెట్టి రూ. 1,20,000ల లోన్ తీసుకున్నాడు. అదే ఫైనాన్స్‌కు చెందిన ఏజెంట్‌కు(ఉద్యోగికి) ప్రతీ నెల సక్రమంగా ఈఎంఐ డబ్బులు చెల్లించాడు. కానీ ఆ ఫైనాన్స్ నుంచి నలుగురు వ్యక్తులు తన ఇంటికి వచ్చి బూతులు తిడుతూ తమ సంస్థకు డబ్బులు చెల్లించ లేదని, పూర్తి డబ్బులు చెల్లించాలని వేధించారని కుటుంబసభ్యులు వాపోయారు. ప్రతీ నెలా ఏజెంట్‌కు డబ్బులు చెలించానని దుర్గయ్య చెప్పగా ఏజెంట్ తమ సంస్థ నుంచి పని మానేశాడని, తమ సంస్థకు డబ్బులు కట్టలేదని, అతనిని ఏమైన చేసుకొమ్మని, తమ సంస్థకు మాత్రం డబ్బులు కట్టాలని బెదిరించారు. దాంతో ఏమి చేయాలో తోచక మనస్తాపం చెందిన దుర్గయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఆస్పత్రిలో దుర్గయ్య చికిత్స పొందుతున్నాడు.

సీతారామాలయంలో దొంగతనం

రాముని అభయహస్తం, హుండీ చోరీ


ఆలయం తాళం పగులగొట్టిన నిందితులు

కల్వశ్రీరాంపూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారామాలయంలో చోరీ జరిగింది. దొంగలు ఆలయ తలుపులు పగుల గొట్టి హుండీలు, స్వామివారి వెండి అభయహస్తం ఎత్తుకెళ్లారు. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్న సీతారామచంద్ర దేవాలయంలో ఇటీవల సీతారాముల కల్యాణం, గణేష్ నవరాత్రులు, దుర్గామాత ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు హుండీలో కానుకలు వేశారు. బుధవారం రాత్రి దొంగలు ఆలయ తలుపులు పగులగొట్టి హుండీతోపాటు దేవుని అభయహస్తం ఎత్తుకెళ్లారు. హుండీని స్థానిక నీలకంఠ చెరువు సమీపంలో పగలగొట్టి అందులో ఉన్న నగదును తీసుకెళ్లారు. ఈ విషయంపై ఆలయ కమిటీ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

కనుకుల పెద్దమ్మ ఆలయంలో చోరీ..

సుల్తానాబాద్: మండలంలోని కనుకుల గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో దొంగతనం జరిగింది. గురువారం ఉదయం పూజారి పూజల కోసం ఆలయానికి వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉందని, ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు. గ్రామంలోని పెద్దలు, ప్రముఖులు వచ్చి చూడగా, అమ్మవారి మెడలో ఉన్న అరతులం పుస్తెలు, మూడు తులాల పట్టగొలుసులు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈమేరకు పోలీసులకు సమాచారం అందించగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మాధవి

శంకరపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను కేశవపట్నం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఏసీపీ మాధవి, కేశవపట్నం ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కేశవపట్నంనకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ బాబా (సోనూ), చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన షేక్ అజీజ్ అనే ఇద్దరు నిందితులు ముత్తారం, కరీంపేట, రేకొండ, మొగిలిపాలెం, బొమ్మనపల్లి గ్రామాల్లో కరెంటు మోటర్లు, దేవాలయాలు, ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 80 వేల రూపా యల నగదు, బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాలకు ఉపయోగించిన టీజీ 22టీ2012 అనే నంబర్ గల ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసును సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చాకచక్యంగా ఛేదించినందుకు, ఇందులో పాల్గొన్న ఎస్ఐ శేఖర్‌రెడ్డి, కానిస్టేబుల్ సల్మాన్‌ను హుజూరాబాద్ ఏసీపీ మాధవి అభినందించారు.

ఇసుకను తరలిస్తున్న వాహనం స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాలీ ఆటోను ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామ శివారులోని స్వాధీనపర్చుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి గురువారం పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి రవాణాదారుడు సిద్దిపేట జిల్లా దుబ్బాకు చెందిన మాధవేని రాజుపై కేసు నమోదు చేశామని తెలిపారు. రాజు తన వాహనంలో మండలంలోని బండలింగంపల్లి గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను అనుమతి లేకుండా తన ఇంటికి తరలిస్తున్న క్రమంలో పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

పోలీసుల అదుపులో రియల్టర్ హత్య కేసు ప్రధాన నిందితుడు

వేములవాడ క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రియల్టర్ సిరిగిరి రమేశ్ హత్యకు పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడైన చిర్రం రవిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెట్రోల్ బంక్ కోసం బంధువుల భూమిని రిజిస్టర్ చేసినందున తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని గత నెల 19న హత్యకు పాల్పడ్డారు. తనను మోసం చేశాడని రవి ఇద్దరికి సుపారీ ఇచ్చి రమేష్ హత్యకు వ్యూహం పన్నాడు. పథకం ప్రకారం గంభీరావుపేట నుంచి సిరిసిల్లకు కారులో వస్తున్న రమేష్‌ను పెద్దూరు వద్ద హత్య చేశారు. ఈ కేసులో సెప్టెంబరు 23న వేములవాడకు చెందిన ఎద్దండి వెంకటేష్, అలా వంశీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 20 రోజులుగా పరారీలో ఉన్న ప్రధాన నిందితుడును చిర్రం రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో 3.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నామని ఎస్ఐ రాహుల్ రెడ్డి గురువారం రాత్రి తెలిపారు. లబ్ధిదారుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి కామారెడ్డికి తరలిస్తున్న కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన వ్యక్తి ముచ్చర్ల జంగయ్యపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. గ్రామంలో పీడీఎస్ బియ్యం ఓ ఇంటిలో నిల్వ చేశారనే సమాచారంతో అక్కడ చేరుకున్నామని చెప్పారు. జంగయ్య ప్రస్తుతం వెంకటాపూర్ గ్రామంలో ఉంటూ స్థానికుల వద్ద పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తు అధిక ధరలకు విక్రయిస్తున్నాడని గుర్తించామని పేర్కొన్నారు. బియ్యం స్వాధీనపర్చుకుని జంగయ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.


గీత కార్మికుడికి గాయాలు

చొప్పదండి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు అతికం నారాయణగౌడ్ (66) ప్రమాదవశాత్తు తాటిచెట్టుపైనుంచి కిందపడగా గురువారం తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నారాయణగౌడ్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నారాయణను ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

మానసిక ఆరోగ్యమూ కీలకమే..

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

సుభాష్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన సమాజంలో వ్యక్తుల మానసిక ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుంది. మంచి పనితీరు సాధించడానికి మానసిక, శారీరక ఆరోగ్యం కలిగి ఉండడం చాలా అవసరం. కొవిడ్ వంటి సంఘటనలు ప్రపంచ వ్యాప్తంగా మానసిక ఆరోగ్య సంక్షోభాన్ని తెచ్చిపెట్టాయి. ఇది ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని మానసికంగా ఎంతో ప్రభావితం చేసింది. మానసిక ఆరోగ్య సమస్యలపై పోరాడడానికి, ఒకరి కొకరు మద్దతు ఇవ్వడానికి, ప్రజలను ఏకం చేయడంలో ప్రపంచ మానసిక దినోత్సవం కీలకపాత్ర పోషిస్తోంది. ప్రపంచ మానసిక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబరు 10న నిర్వహిస్తారు. మన దేశంలో ప్రతి ఆరు గురిలో ఒకరు ఏదో ఒక మానసిక సమస్యతో బాధ పడుతున్నారని లెక్కలు చెబుతున్నాయి. డిప్రెషన్, ఆందోళన, మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎక్కువ మంది మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. కొవిడ్ తరువాత ఈ సమస్య మరింతగా పెరిగినట్లు సర్వేలు చెబుతున్నాయి. ప్రజలకు శారీరక ఆరోగ్య సమస్యలపై ఉన్నట్లుగా మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన లేకపోవడం కూడా సమస్య జటిలం అవడానికి కారణమని వైద్య నిపుణులు తెలియచేస్తున్నారు. మానిసిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టాలని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





10.6 శాతం మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నారు

డాక్టర్ ఎల్ వర్షి, ప్రభుత్వ ఆసుపత్రి మానసిక వైద్యనిపుణుడు



నేషనల్ మెంటల్ హెల్త్ 2015-16లో చేపట్టిన సర్వే ప్రకారం మనదేశంలో 10.6 శాతం మంది మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కొవిడ్ తరువాత ఈ సంఖ్య మరింతగా పెరిగింది. మన దేశంలో మెంటల్ హెల్త్ అనేది ఒక వ్యక్తి సమస్య కాకుండా ఒక కుటుంబ సమస్యగా చూస్తారు. మానసిక సమస్యతో బాధపడుతున్న వారిపై వివక్ష చూపిస్తారు. దీంతో ఆ కుటుంబం సమాజంలో మానసికంగా, ఆర్థికంగా, శారీరకంగా అన్ని రకాలుగా నష్టపోతుంది. మానసిక సమస్యలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండడం లేదు. మానసిక సమస్యలు ఎదురైతే ముందుగా మంత్రతంత్రాల కార్యక్రమాలు చేస్తున్నారు. దీంతో సమస్య మరింత ముదురుతుంది. ప్రజలు మానసిక సమస్యలపై అవగాహన పెంచు కోవాలి, ఇతరులకు కూడా తెలియచేయాలి. సకాలంలో మానసిక వైద్యుడిని సంప్రదిస్తే సమస్య పరిష్కారమవుతుంది.

కొలిక్కిరాని వృద్ధ దంపతుల కేసు

- మూడురోజులుగా కోమాలోనే లక్ష్మి - ఆధారాలు సేకరించిన ఫోరెన్సిక్ బృందం


గర్షకుర్తిలో నమూనాలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ బృందం

గంగాధర, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తిలో వృద్ధ దంపతుల కేసులో మూడు రోజులైనా నిందితుల ఆచూకీ లభించలేదు. ఈ ఘటనలో శంకరయ్య మృతి చెందగా భార్య లక్ష్మి మూడు రోజులుగా చికిత్స పొందుతోంది. ప్రస్తుతం కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న లక్ష్మి కోమాలో నుంచి బయటపడ లేదు. గురువారం కరీంనగర్ నుంచి ఫోరెన్సిక్ బృందం గర్షకుర్తిలోని వృద్ధుల ఇంటిని పరిశీలించారు. ఎస్సై వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఫోరెన్సిక్ బృందం ఇంటిని, పరిసరాలను పరిశీలించి ఆధారాలను సేకరించారు. చుట్టుపక్కల నివాసముంటున్న వారిని కొత్త వారు ఎవరైనా వచ్చినట్లు గమణించారని వివరాలను అడిగారు.

● విషప్రయోగమని అనుమానాలు?

దంపతులపై దుండగులు విషప్రయోగం చేసి ఉంటారని అనుమానాలు బలపరుస్తున్నాయి. ఏదైనా మత్తు మందు ప్రయోగిస్తే రెండు మూడు గంటల్లో స్పృహ వస్తుండేది. ఘటన జరిగిన 24 గంటల్లోనే శంకరయ్య మృతి చెందగా, మూడు రోజులైనా లక్ష్మి కోమాలో నుంచి బయటికి రాకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దంపతులపై దుండగులు విషప్రయోగం చేసి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. వృద్ధులకు సంతానం లేకపోవడంతో ఎవరో ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని గ్రామస్థులు వాపోయారు. అయితే ఏదైన దొంగతనానికి వచ్చిన వారు బంగారం, ఇంట్లోని నగదు, ఆభరణాలు ఎత్తుకెల్లుతారు కానీ ఇంతటి ఘాతుకానికి పాల్పడుతారా అని గ్రామస్థులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎస్సై వంశీకృష్ణను వివరణ కోరగా పోలీసులు, వైద్య బృందం ప్రత్యేకంగా విచారణ చేస్తున్నామని, నిందితులను పట్టుకుని కేసు మిస్టరీని త్వరలోనే ఛేదిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక





ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, కబడ్డీ పోటీలకు ఎంపికైన కస్తూర్బా గాంధీ విద్యార్థి సాత్విని, బాక్సింగ్ పోటిలకు ఎంపికైన రజిత

ధర్మారం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న కరీంనగర్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ 19 విభాగంలో పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 10 నుంచి 12వ తేది వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరుపున ఆడుతారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వ్యాయామ పాఠశాల ఉపాధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవ రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..

ఓదెల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్స రం ఎంపీసీ చదువుతున్న కె సాత్విని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి జిల్లా లోని రేకుర్తిలో ఇటీవల జిల్లా స్థాయి అండర్-19 కబడ్డీ టోర్నీ నిర్వహించగా, ఇందులో సాత్విని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైంది. మహబూబాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో విద్యార్థి పాల్గొననుంది. విద్యార్థినిని కస్తూర్బా పాఠశాల కస్తూర్బా గాంధీ ఎస్‌వో జ్యోతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు..

మంథనిరూరల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని నారుమల్ల రజిత రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జ్యోతి గురువారం తెలిపారు. 48 కేజీల విభాగంలో రజిత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 10, 11, 12 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఆమె అర్హత సాధించినట్లు తెలిపారు. విద్యార్థిని రజితను పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, పీడీ డాక్టర్ దొమ్మటి రవి, ఉపాధ్యాయులు అభినందించారు.

విస్తరిస్తున్న కరీంనగర్ డెయిరీ



(3వ పేజీ తరువాయి)

పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో కంటే పాల సేకరణ పెరిగిందని, సేకరణ లక్ష్యం చేరువలో ఉండడంతో పాల ఉత్పత్తుల అమ్మకాలపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఏ రోజుకు ఆ రోజు 24 గంటల్లోగానే తాజా పాలను వినియోగదారులకు అందిస్తున్న సంస్థగా కరీంనగర్ డెయిరీ నిలుస్తున్నదన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పాలు మూడు, నాలుగు రోజులకు కానీ వినియోగదారులకు అందుబాటులోకి రావన్నారు. ప్రస్తుతం కరీంనగర్ డెయిరీ ప్రత్యేకంగా ఆవు పాల ప్యాకెట్లను మార్కెట్‌లో విక్రయిస్తున్నదని, త్వరలోనే ఆవు నెయ్యిని కూడా వినియోగదారులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

కరీంనగర్ డెయిరీ పాలకు, పెరుగుకు డిమాండ్ ఉండడంతో పెరుగును మరింత నాణ్యతతో ఎక్కువగా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పాల ఉత్పత్తులైన బాసుంది, బాదుషా, కలాకాండ్, కాజూ కత్లీ స్వీట్లను కొత్తగా ఈ దీపావళికి మార్కెట్‌లో ప్రవేశ పెట్టనున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు కూడా నెయ్యిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాజేశ్వర్‌రావు వివరించారు. ప్రస్తుతం మార్కెట్‌లో డెయిరీ గోల్డ్ మిల్క్, టోన్డ్ మిల్క్, ఫ్యూర్‌మిల్క్, టీ స్పెషల్, థిక్ మిల్క్, స్పెషల్ మిల్క్ ప్యాకెట్ల ను వినియోగదారులకు విక్రయిస్తున్నదని చెప్పారు. పెరుగు 1, 2, 5, 10 కిలోల బకె ట్లు, 40 కేజీల క్యాన్ రూపంలో అందిస్తు న్నామన్నారు. వినియోగదారుల గృహ అవసరాల కోసం 120, 180, 500 మిల్లీ లీటర్లు, ఒక లీటర్ ప్యాకెట్లను మార్కెట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. 100, 400 గ్రాముల కప్పుల్లోనూ పెరుగు విక్రయిస్తు న్నామని రాజేశ్వర్‌రావు తెలిపారు.

యాప్‌లో ఆర్డర్ చేస్తే ఇంటి వద్దకు పాలు

కరీంనగర్ డెయిరీ వినియోగదారుల ఇళ్లకు పాలను, పాల ఉత్పత్తులను చేర్చేందుకు ఏర్పాట్లు చేసింది. కరీంనగర్ డెయిరీ యాప్‌ను ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంచింది. ఈ యాప్‌ను వినియోగదారులు డౌన్‌లోడ్ చేసుకొని దాని ద్వారా ఆర్డర్ చేస్తే అరగంటలోగానే ఇంటి వద్ద డెలివరీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ యాప్‌లో కనీసం 200 రూపాయల మేరకు ఆర్డర్ చేయాల్సి ఉంటుంది. ఎమ్మార్పీపై 10 శాతం డిస్కౌంట్‌తో పాలు, పాల ఉత్పత్తులను వినియోగదారుల ఇంటి వద్దకు చేర్చుతామని రాజేశ్వర్‌రావు తెలిపారు. 91777-37070, 98489-38996 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు. స్విగ్గీ, జొమాటో లాగా కరీంనగర్ డెయిరీ యాప్ ద్వారా ఆర్డర్ చేస్తే ఫంక్షన్లకు, ఇంటి అవసరాలకు పాలు, పెరుగు, నెయ్యి, ఇతర ఉత్పత్తులను 10 శాతం రాయితీపై పొందవచ్చని ఆయన చెప్పారు.

పాడి రైతులకు సంక్షేమ పథకాలు

కరీంనగర్ డెయిరీలో భాగస్వాములైన పాడి రైతులకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చైర్మన్ రాజేశ్వర్‌రావు తెలిపారు. కల్యాణమస్తు పథకం ద్వారా పాడి రైతు కూతురు పెళ్లికి బంగారు పుస్తె, వెండి మట్టెలు డెయిరీ నుంచి కానుకగా అందిస్తున్నామన్నారు. పాడిరైతు భరోసా ద్వారా స్కీములో చేరిన పాడి రైతు లేది అతని భార్య మరణిస్తే ఆ కుటుంబానికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా పథకంలో చేరిన వారి 15 శాతం పిల్లలు (9, 10వ తరగతి చదువుతున్న) స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. పాలనిధి పథకం ద్వారా 60 సంవత్సరాలపైన ఉన్న పాడి రైతులకు పింఛన్ లేదా జమ కూడిన డబ్బును ఏకమొత్తంగా చెల్లిస్తున్నామని రాజేశ్వర్‌రావు వివరించారు. పాడిరైతు సంక్షేమ నిధి కింద రుణం తీసుకున్న రైతు మరణిస్తే 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు.



కరీంనగర్ డెయిరీ నెయ్యి

విద్యా ప్రోత్సాహకాలుగా ప్రతి ఎంసీసీ పరిధిలో ఇంటర్మీడియట్‌లో మొదటి ర్యాంకు వచ్చిన పాడి రైతు పిల్లలకు 10 వేలు, రెండో ర్యాంకు వచ్చిన వారికి ఎనిమిది వేలు, మూడో ర్యాంకు వచ్చిన వారికి ఐదు వేల రూపాయలను ప్రోత్సా హకంగా కరీంనగర్ డెయిరీ అందిస్తుందని రాజేశ్వర్‌రావు తెలిపారు. పాలకేంద్ర భవన నిర్మాణానికి చేయూత పథకం ద్వారా 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం, అందుబాటు ధరలకు నాణ్యమైన ఎరువులును పాల సంఘాల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. పాడి రైతు దహన సంస్కారానికి చేయూత ద్వారా రైతుకు ఐదు వేలు, సంఘం అధ్యక్షుడికి ఏడు వేల రూపాయలను ఇస్తున్నామని చైర్మన్ రాజేశ్వర్‌రావు చెప్పారు. కరీంనగర్ డెయిరీ పాడి రైతులకు ఆర్థిక భరోసా ఇవ్వడంతో పాటు వినియోగదారులకు ఆరోగ్య రక్షణ కల్పిస్తుందని తెలిపారు.




డెయిరీలో తయారు చేస్తున్న వివిధ రకాల స్వీట్లు

ఎన్టీపీసీ సోలార్ ప్రాజెక్టులో ప్రమాదం

వలస కార్మికుడి మృతి

జ్యోతినగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమీపంలో సోలార్ ప్లాంటు నిర్మాణ పనుల్లో గురువారం జరిగిన ప్రమాదంలో శివ దయాల్ రావత్ (23) అనే వలస కార్మికుడు మృతి చెందాడు. నిర్మాణ పనులలో భాగంగా పోల్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ మీద పడడంతో శివ దయాల్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతడిని గోదావరి ఖని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు శివదయాల్‌ను మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సోలార్ నిర్మాణ పనులను నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ కంపెనీ సబ్ కాంట్రాక్టర్ వద్ద శివదయాల్ పనిచేస్తున్నాడు. సమాచారాన్ని అతని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తెలతాడు చోరీకి యత్నం

వేములవాడ క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ పరిధిలోని తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం ఉదయం బస్సు దిగుతున్న ఓ మహిళ మెడలో నుంచి ఓ గుర్తుతెలియని వ్యక్తి పుస్తెలతాడు చోరీకి ప్రయత్నించాడు. అయితే మహిళ ప్రతిఘటించి కేకలు వేయడంతో పాటు గట్టిగా పట్టుకోవడంతో తోటి ప్రయాణికులు నిందితుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఎస్సారెస్పీకి 49,984 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 16 గేట్లు పైకి ఎత్తి 49,984 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతి కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు విడుదలవుతోంది.

పురుగుల మందు డబ్బాలతో మహిళా సంఘం సభ్యుల నిరసన

వేములవాడ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నెలనెలా కట్టిన డబ్బులు బ్యాంకు కరస్పాండెంట్ వాడుకుందని, డబ్బులు తిరిగి చెల్లించాలని మహిళా సంఘం సభ్యులు యూనియన్ బ్యాంకు ఎదుట పురుగుల మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన సాయిబాబా మహిళా సంఘంలోని 11 మంది సభ్యులు గతంలో యూనియన్ బ్యాంకులో రూ. 15 లక్షల రుణాన్ని తీసుకున్నారు. అయితే ప్రతీనెలా సభ్యులు క్రమంతప్పకుండా రుణం డబ్బులను బ్యాంకు కరస్పాండెంట్ అయిన ఓ మహిళకు అప్పగించారు. అప్పు పూర్తిగా తీరిందని గ్రూప్ సభ్యులు నమ్మారు. కానీ సాయిబాబా మహిళా సంఘం పేరుతో రూ.1.05 లక్షలు అప్పు మిగిలి ఉందని, వాటిని కట్టాలని సభ్యులకు బ్యాంకు అధికారులు సూచించారు.

బ్యాంకుకు వెళ్లిన సభ్యులు అప్పు మొత్తం కరస్పాండెంట్‌కు చెల్లించామని, ఆమె డబ్బులు బ్యాంకులో కట్టలేదని, ఆమెపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. సదరు బ్యాంకు కరస్పాండెంట్ లక్షా ఐదు వేల రూపాయలను గురువారం తిరిగి బ్యాంకులో జమ చేసిందని, దీంతో సమస్య పరిష్కారమైందని బ్యాంకు మేనేజర్ సురేష్ తెలిపారు.

ప్రమాదకరంగా ఇబ్రహీంపట్నం-వర్షకొండ రోడ్డు

- అడుగడుగునా గుంతలతో ప్రయాణికుల ఇక్కట్లు



రోడ్డు మధ్యలో గుంత చుట్టూ వేసిన చెట్టుకొమ్మలు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నుంచి జిల్లా సరిహద్దు గ్రామమైన వర్షకొండకు వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతల దగ్గర ప్రమాద సూచికలకు బదులు చెట్టుకొమ్మలు అడ్డుగా పెట్టారు. దీనివల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలుమార్లు ఫిర్యాదు చేసినా రోడ్లు, భవనాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. వర్షాకాలంలో రెండు గ్రామాల మధ్య గల రెండు లో లెవెల్ వంతెనలపై నుంచి వర్షపు నీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. 2.20 కోట్ల రూపాయల నిధులతో హైలెవల్ వంతెనల నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి హైలెవల్ వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

యమధర్మరాజు ఆలయంలో అభిషేకం

ధర్మపురి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో గురువారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు స్వామి వారికి రుద్రాభిషేకం, పురుషసూక్తం, లక్ష్మీసూక్తం, మన్యసూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమం, ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

ప్రశ్నించే గొంతుకులను అణిచివేస్తున్న కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

శంకరపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శంకరపట్నం మండలం సీపీఐ మండల శాఖ కార్యాలయంలో గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సాగర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సంవత్సరాలు అవుతున్న స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి దూరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం కులగణన చేపట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ప్రశ్నించే గొంతుకలైన వామపక్ష నాయకులను మోదీ అనుచివేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్ పాల్గొన్నారు.

మనస్తాపంతో వృద్ధుడి బలవన్మరణం



అంజయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భార్య మరణించడం.. అనారోగ్య సమస్యలు భరించలేక మనస్తాపం చెందిన వృద్ధుడు పోతు అంజయ్య(76) ఉరివేసుకుని బలవన్మరణానికి ఒడిగట్టిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని పోతు అంజయ్యకు ముగ్గురు కొడుకులు ఆనందం, రమేశ్, అశోక్ ఉన్నారు. పెద్ద కొడుకు ఆనందం, భార్య లక్ష్మి మృతిచెందారు. ఇద్దరు కొడుకులు తన కుటుంబీకులతో కలిసి అమెరికాలో ఉంటున్నారు. అంజయ్య, సోదరి రాపెల్లి కళావతిలు కలిసి ఇంటిలో నివసిస్తున్నారు. అంజయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భార్య లక్ష్మి చనిపోవడం.. అనారోగ్య సమస్యలు తట్టుకోలేక మనస్తాపానికి గురైన అంజయ్య ఇంటిలో ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి సోదరి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ వివరించారు.

వృద్ధురాలిని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

వేములవాడ క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ పరిధిలోని తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద కాలినడకన వెళుతున్న ఓ వృద్ధురాలిని గురువారం గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వరంగల్‌కు చెందిన రాజవ్వ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. తిప్పాపూర్ బస్టాండ్ వద్ద పడిపోయిన వృద్ధురాలిని ఆర్టీసీ అధికారులు చికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా వాహనదారుడిని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

వ్యాపారులను దెబ్బతీసిన మక్కలు



- డిమాండ్ ఉందని గత రబీలో భారీగా కొనుగోళ్లు
- ధర తగ్గడంతో నష్టం

జమ్మికుంట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మక్కల ధరలు భారీగా తగ్గడంతో గత సీజన్‌లో నిల్వ చేసిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మక్కలకు మద్దతు ధర క్వింటాల్‌కు 2,225 రూపాయలు ఉంది. ఆ సమయంలో మక్కలకు మంచి డిమాండ్ ఉండడంతో ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధర కంటే ఎక్కువ చెల్లించి రైతుల నుంచి కొన్నారు. ధర పెరుగుతుందని భావించి గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. అనుకున్న విధంగా మక్కలకు పౌల్ట్రీల్లో మంచి డిమాండ్ రావడంతో వ్యాపారుల పంట పండింది. క్వింటాల్‌కు మూడు వేల రూపాయల ధర పలికింది. సగటున 2,300 రూపాయలు చెల్లించి కొన్న వ్యాపారులకు క్వింటాల్‌కు ఏడు వందల రూపాయల వరకు లాభం వచ్చింది. గతేడాది ఖరీఫ్‌లో అధిక లాభాలు రావడంతో రబీలో క్వింటాల్‌కు రూ. 2,400 వరకు ధర చెల్లించి రైతుల నుంచి వ్యాపారులు కొన్నారు. వ్యాపారంతో సంబంధం లేని వ్యక్తులు కూడా లాభాలు వస్తున్నాయని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వలు చేశారు. జమ్మికుంట పరిధిలోని సుమారు 150 మంది వ్యాపారులు మూడు లక్షల క్వింటాళ్ల వరకు నిల్వ చేశారు. మక్కల కొనుగోళ్ల ద్వారా జమ్మికుంట మార్కెట్‌కు ఒక శాతం ఫీజు 60 లక్షల ఆదాయం సమకూరింది. కొంత మంది వ్యాపారులు మార్కెట్ ఫీజుకు ఎగనామం పెట్టినట్లు తెలుస్తుంది.

మక్కలకు తగ్గిన డిమాండ్

ఈ ఏడాది మూడు వేల పైచిలుకు ధర పలుకుతుందని ఆశించిన వ్యాపారులకు చుక్కేదురైంది. ప్రస్తుతం క్వింటాల్‌కు 2,250 రూపాయలు మించి పలుకడం లేదు. ఏప్రిల్ నుంచి ధరలు పెరుగుతాయని భావించిన వ్యాపారులు ఆగస్టు వరకు గోదాముల్లో నిల్వలు ఉంచారు. ఎక్కువ రోజులు గడిస్తే పురుగు వచ్చే ప్రమాదం ఉందని గ్రహించిన వ్యాపారులు పౌల్ట్రీలకు 2,250 చొప్పున విక్రయించడం మొదలు పెట్టారు. సెప్టెంబరు చివరి వారం వరకు మక్కల విక్రయాలు పూర్తి చేశారు.



లక్షల్లో నష్టాన్ని చవి చూసిన వ్యాపారులు

క్వింటాకు 2,350 రూపాయల చొప్పున ఒక వ్యక్తి వెయ్యి క్వింటాళ్లు కొనుగోలు చేస్తే 23.5 లక్షల పెట్టుబడి అవుతుంది. ప్రస్తుత ధర 2,250 రూపాయల ప్రకారం విక్రయిస్తే లక్ష రూపాయల నష్టం వస్తుంది. దీనికి తోడు వ్యాపారులు విక్రయించిన ఐదు నెలలకు డబ్బులు ఇచ్చే విధంగా పౌల్ట్రీ వ్యాపారులు ఒప్పందం చేసుకున్నారు. పెట్టుబడి డబ్బులు, విక్రయించిన తర్వాత మరో ఐదు నెలలు బ్యాంకు ఇంట్రెస్ట్, గోదాముల అద్దె, హమాలీ, ట్రాన్స్‌పోర్టు, మార్కెట్ ఫీజు రూపంలో రెండు లక్షలు మొత్తంగా మూడు లక్షల నష్టం చవి చూశారు. క్వింటాకు 300 రూపాయల నష్టం ప్రకారం మూడు లక్షల క్వింటాళ్లకు తొమ్మిది కోట్ల నష్టం వాటిల్లింది.

టీఆర్‌పీ సోషల్ మీడియా ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా నితిన్‌గౌడ్



కరీంనగర్ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) సోషల్ మీడియా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా కొత్తపల్లికి చెందిన గుర్రం నితిన్‌గౌడ్ నియామకమయ్యారు. ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ఆకుల మనోజ్‌కుమార్ గురువారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆదేశాలతో రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాలకు సోషల్ మీడియా కన్వీనర్లను నియమించారు. పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నకు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మనోజ్‌కుమార్‌కు నితిన్‌కుమార్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపులో ఆలస్యం

- ఆర్డీవో కార్యాలయం ఫర్నిచర్ జప్తు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపులో ఆలస్యంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జగిత్యాల ఆర్డీవో కార్యాలయం ఫర్నిచర్‌ను గురువారం కోర్టు అధికారులు జప్తు చేశారు. న్యాయవాది లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్-పెద్దపల్లి రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా జగిత్యాల ప్రాంతంలో 130 ఎకరాల భూమిని సేకరించారు. నష్టపరిహారంగా ఎకరానికి లక్షా 27 వేలు, లక్షా 33వేల రూపాయల చొప్పున రైతులకు చెల్లించడానికి 2006లో అధికారులు అవార్డు జారీ చేశారు. తమకు మార్కెట్ ధర కన్నా తక్కువ నష్టపరిహారం వద్దని వంద మంది రైతులు జగిత్యాల సివిల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో సివిల్ కోర్టు 2010లో రైతులకు 10 లక్షల 64 వేల ఎనిమిది వందల రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించాలని జగిత్యాల ఆర్డీవోను ఆదేశించింది. ఈ విషయమై జగిత్యాల ఆర్డీవో హైకోర్టును ఆశ్రయించగా రైతులకు 15 లక్షల 97 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని హైకోర్టు 2014లో ఆదేశించింది. హైకోర్టు తీర్పుపై ఆర్డీవో సుప్రీంకోర్టుకు వెళ్లగా సివిల్ కోర్టు సూచించినట్లు 10 లక్షల 64 వేల ఎనిమిది వందల నష్టపరిహారం చెల్లించాలని 2018లో ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి రైతులకు ఇవ్వాల్సిన 5.37 కోట్ల రూపాయల నష్టపరిహారంలో కొంత మొత్తం డిపాజిట్ చేసి మిగతా సొమ్ము ఇవ్వకపోవడంతో రైతులు పలుసార్లు ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించినా అధికారులు స్పందించలేదు. దీంతో రైతులు మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఫర్నీచర్ జప్తునకు ఆదేశించింది. ఈ మేరకు గురువారం ఆర్డీవో కార్యాలయం ఫర్నీచర్‌ను కోర్టు సిబ్బంది ట్రాక్టర్‌లో తరలించారు.



జగిత్యాల ఆర్డీవో కార్యాలయం ఫర్నీచర్‌ను తరలిస్తున్న కోర్టు సిబ్బంది

మార్కండేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణం చేపట్టడానికి సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకు సహాయం చేయాలని శ్రీమార్కండేయ స్వామి జయంతి మహోత్స సమితి కన్వీనర్ మోర శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం లోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణం చేయడం కోసం శ్రీ మార్కండేయ స్వామి జయంతి మహోత్సవ సమితి అందరితో కలసి కార్యాచరణను రూపొందించిందన్నారు. స్థానిక శాంతినగర్ నుంచి భూపతినగర్ వరకు, స్థానిక చంద్రంపేట నుంచి సాయినగర్ వరకు పద్మశాలి కులస్థులు, హిందువుల అభిప్రాయాలతో కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు. శ్రీశివభక్త మార్కండేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణం నిధుల సేకరణను మరో పది రోజులలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణ ప్రజలు దేవాలయం నిర్మాణంలో తమ వంతుగా నిధులను సమర్పించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మేరుగు సత్యనారాయణ, మాదాసు శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, కోడం రవి, గుంటుక పురుషోత్తం, చిమ్మని ప్రకాష్, గాజుల సదానందం, గుడ్ల విష్ణు, జిందం రవి, ఎనగంటి నరేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం..

రుద్రంగి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, అప్పుడే ఆరోగ్యవంతంగా ఎదుగుతారని సీడీపీవో సౌందర్య అన్నారు. మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మండల స్థాయి పోషణ జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహార పదార్థాల్లోని పోషకాలను వివరించారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఎప్పటికప్పుడు పిల్లల బరువును, ఎత్తును చూసి తల్లిదండ్రులకు తెలుపాలన్నారు. సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ టీచర్‌లు కోమిరె మంజుల, గడప జ్యోతి, అంబటి సరిత పాల్గొన్నారు.

ఆటపాటలతో ఆధునిక విద్యాబోధన..

- పెద్దలింగాపూర్ ప్రాథమిక పాఠశాలకు 'పీఎంశ్రీ' గుర్తింపు - కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయానికి రూ.33లక్షలు మంజూరు
- మెరుగైన వసతుల కల్పనతో పెరిగిన విద్యార్థుల సంఖ్య



పెద్దలింగాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల


కంప్యూటర్లపై విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు

ఇల్లంతకుంట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కొన్ని పాఠశాలలను పీఎంశ్రీ పాఠశాలలుగా గుర్తించింది. ఆయా పాఠశాలలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి భవిష్యత్తులో విద్యార్థులు ఉత్తములుగా నిలువాలనే ఉన్నత ఆశయంతో నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తోంది. జిల్లాలోని ఇల్లంతకుంట, కోనరావుపేట, చందుర్తి, వీర్నపల్లి, బోయినపల్లి మండలాలోని ప్రాథమిక పాఠశాలలను పీఎంశ్రీ పాఠశాలలుగా గుర్తించింది. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఎంపిక అయ్యింది. అందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయాలకు రూ.33.5 లక్షలు కేటాయించగా, పనులు కొనసాగుతున్నాయి. పాఠశాలలో విద్యార్థులకు ఆటపాటలతో ఆధునిక పద్ధతిలో విద్యాబోధన కొనసాగిస్తుండటంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. గత విద్యాసంవత్సరంలో 78మంది విద్యార్థులు ఉండగా, ఈ విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్య 110కి చేరింది. పాఠశాలలోనే పూర్వ ప్రాథమిక పాఠశాలను కూడా ఏర్పాటు చేయడంతో తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. పాఠశాలలో అవుట్‌డోర్‌తోపాటు ఇండోర్ ఆటలకు అవసరమైన పరికరాలు ఏర్పాటుచేశారు. విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రతి విద్యార్థికి ఏటా రూ.500..

పీఎంశ్రీ పాఠశాల ఎంపిక కాగా పూర్వ ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతి ఒక్కరికి సంవత్సరానికి రూ 500 ప్రభుత్వం కేటాయిస్తుంది. వచ్చిన నిధుల ద్వారా పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించింది. ఇవే కాకుండా స్కూల్ గ్రాంట్ క్రింద రూ 50వేలు, టీఎల్‌ఎమ్, ఎక్స్‌పోజర్ విజిట్, పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాల కోసం రూ 10వేలు కేటాయిస్తుంది. పాఠశాలకు విశాలమైన ఆటస్థలం ఉండటం వల్ల నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులకు వివిధ రకాలైన ఆటలలో ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. పీఎంశ్రీ పాఠశాల కావడంతో ఇన్‌స్ట్రక్టర్‌తో పాటు ఆయాను కేటాయించింది. పిల్లలు చదువుకోవడానికి బొమ్మలతో కూడిన పుస్తకాలు, పిల్లలకు ప్రత్యేక టేబుళ్ళు, కుర్చీలు పాఠశాలలో ఉండటంతో పాఠశాలకు రావడానికి విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు..

- లింగంపల్లి భాగ్య, విద్యార్థి తల్లి, పెద్దలింగాపూర్



ప్రభుత్వ పాఠశాలలో వసతులు మెరుగ్గా ఉండటం, ఆధునికి పద్ధతిలో విద్యాబోధన జరుగుతుండటంతో ఇద్దరు పిల్లలను పాఠశాలకు పంపుతున్నాను. గతంలో పాఠశాలకు పోవడానికి ఇబ్బంది పెట్టే పిల్లలు ఉత్సాహంగా పోతున్నారు. పిల్లలకు కంప్యూటర్ విద్యను అందిస్తుండటంతో భవిష్యత్తులో రాణిస్తారనే నమ్మకం ఉంది. పాఠశాలకు వెళ్లే పెద్ద పిల్లలతో పాటు చిన్నవారు కూడా పాఠశాలకు వెళుతున్నారు. ఆయా ఉండటం వల్ల ఎలాంటి ఇబ్బంది కలుగడం లేదు.

గతంలో కంటే విద్యార్థుల సంఖ్య పెరిగింది..

- గుర్రం సందీప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు



గతంలో పాఠశాలకు వచ్చే విద్యార్థులకంటే ఈవిద్యా సంవత్సరంలో పెరిగింది. ప్రస్తుతం పాఠశాలలో 110 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు ఆటపాటలతో విద్యను అందిస్తుండటం వల్ల హాజరు శాతం మెరుగయ్యింది. తల్లిదండ్రుల నమ్మకాన్ని కాపాడుకుంటూ మెరుగైన విద్యనందించడానికి ఉపాధ్యాయులందరం కృషిచేస్తున్నాం. విద్యార్థుల సంఖ్యను పెంచుతాం. పాఠశాలలో ప్రతి సందర్భాన్ని పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

ఎన్నికల పండుగకు బ్రేక్..

(3వ పేజీ తరువాయి)

వీర్నపల్లి మహిళా జనరల్, చందుర్తి, తంగళ్ళపల్లి జనరల్ రిజర్వ్ చేశారు. 260 సర్పంచ్ స్థానాల్లో ఎస్టీలకు 30, ఎస్సీలకు 53, బీసీలకు 101, జనరల్ 76 స్థానాలను కేటా యించారు. దీని ప్రకారం షెడ్యూల్ జారీ చేయడంతో పాటు గురువారం తొలి విడత నామిషన్ల స్వీకరణ ప్రారంభించారు.

● **ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి..**

జిల్లాలో అప్పటికే అధికార యంత్రాగం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు కూడా పూర్తి చేసింది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 123 ఉండగా, జడ్పీటీసీ స్థానాలు 12ఉండగా, 260 జీపీలు, 2268 వార్డులు ఉన్నాయి. మొదటి విడతలో 65 స్థానాలు, 377 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. బోయినపల్లి 11 స్థానాలు, 10 పోలింగ్ కేంద్రాలు, చందుర్తి 10 స్థానాలు, 54 పోలింగ్ కేంద్రాలు, రుద్రంగి 5స్థానాలు, 27 పోలింగ్ కేంద్రాలు, వేములవాడఅర్బన్ 6 స్థానాలు, 36 పోలింగ్ కేంద్రాలు, వేములవాడరూరల్ 7 స్థానాలు, 40 పోలింగ్ కేంద్రాలు, కోనరావుపేట 12 స్థానాలు, 70 పోలింగ్ కేంద్రాలు, ఇల్లంతకుంట 14 స్థానాలు, 90 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. రెండో విడతలో 58 స్థానాలు, 332 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తంగళ్ళపల్లి 14స్థానాలు, 77పోలింగ్ కేంద్రాలు, ఎల్లారెడ్డిపేట 13 స్థానాలు, 85 పోలింగ్ కేంద్రాలు, వీర్నపల్లి 5 స్థానాలు, 26 పోలింగ్ కేంద్రాలు, ముస్తాబాద్ 13 స్థానాలు, 75పోలింగ్ కేంద్రాలు, గంభీరావుపేట 13 స్థానాలు, 69 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. రెండో ఫేజ్‌లో మొదటి విడతలో జీపీలు 137, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 1188 ఉన్నాయి, గంభీరావుపేట జీపీలు 22 వార్డులు, పోలింగ్ కేంద్రాలు 202, ముస్తాబాద్ జీపీలు 22 వార్డులు, పోలింగ్ కేంద్రాలు 202, తంగళ్ళపల్లి జీపీలు 30, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 252, ఇల్లంతకుంట జీపీలు 35, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 294, కోనరావుపేట జీపీలు 28, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 238 ఉన్నాయి. మూడో ఫేజ్‌లో జీపీలు 123, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 1080 ఉన్నాయి. వేములవాడ అర్బన్ జీపీలు 11, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 86, రుద్రంగి జీపీలు 10, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 86, చందుర్తి జీపీలు 19, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 174, వేములవాడ రూరల్ జీపీలు17 వార్డులు, పోలింగ్ కేంద్రాలు 174, బోయినపల్లి జీపీలు 23, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 212, వీర్నపల్లి జీపీలు 17, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 132, ఎల్లారెడ్డిపేట జీపీలు 26, వార్డులు, పోలింగ్ కేంద్రాలు 226 ఉన్నాయి.

హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం


కాంగ్రెస్ బాకీ కార్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డిలు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో గురువారం కాంగ్రెస్ బాకీకార్డులను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచిపోయినా ఏఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో చెరుకుపల్లి రాజిరెడ్డి, ఒగ్గు నర్సయ్యయాదవ్, రాగటి రమేష్ కేవీఎన్‌రెడ్డి, కట్ట వెంకటొరెడ్డి, ఉడుతల వెంకన్న, కమటం రాములు, సావనపెల్లి అనీల్‌కుమార్, సాదుల్, రఘు, రాజారాం, వెంకటేశం, కొట్టె వెంకన్న, తడకపెల్లి భూమయ్య, శ్రీనివాస్, గుర్రం తిరుపతిరెడ్డి, బాలరాజు, మామిడి తిరుపతి, ప్రశాంత్, కొమురయ్య, ముత్యంరెడ్డి, బాలయ్య, పర్శరాం, కళావతి, తూటి పర్శరాంలతో పాటు వివిద గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్‌లో రెండు నామినేషన్‌ల దాఖలు

వేములవాడ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా మొదటిరోజు వేములవాడ రూరల్ మండలంలో రెండు నామినేషన్‌లు దాఖలయ్యాయి. రూరల్ మండల పరిషత్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రానికి హన్మాజీపేట గ్రామానికి చెందిన చిలుక ప్రభాకర్ ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా, చెక్కపల్లి గ్రామానికి చెందిన ఏడపల్లి అనిల్ జడ్పీటీసీ అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేసినట్లు తెలిపారు. ఇద్దరు కాంగ్రెస్ పార్టీకి చెందినవారని తెలిపారు. వేములవాడ అర్బన్ మండలంలో ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని అధికారులు వెల్లడించారు.

సిరిసిల్ల వేదికగా కేటీఆర్ అవినీతి..


కార్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లను వేదికగా చేసుకుని కేటీఆర్ రాష్ట్రంలో అవినీతికి ఆజ్యం పోశాడని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కా దోఖా కార్డ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజలను మోసం చేసిన విషయాలను కార్డులో పొందుపరిచి ప్రజల్లోకి తీసుకుపోతామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన కొనసాగుతుంటే బీఆర్ఎస్ జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో బీసీలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. మూడు వేల కోట్ల విలువైన ఇసుకను సిరిసిల్ల నుంచి తరలించి కోట్లు సంపాదించిన బీఆర్ఎస్ దోఖా కార్డులు విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నేరెళ్ల నర్సింగంగౌడ్, లింగాల భూపతి, సత్తు శ్రీనివాస్ రెడ్డి, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్, ఆరేపెల్లి బాలు, మునిగెల రాజు, చుక్క శేఖర్, మీరాల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్థుడి అరెస్ట్


సైబర్ నేరస్థుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరుతో వాట్సాప్‌కి ఏపీకే లింక్ షేర్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న జార్కండ్ రాష్ట్రంలోని థానా మోహన్‌పూర్‌లోని బుస్దిహ గ్రామానికి చెందిన అంకిద్ కుమార్(32)ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల డీఎస్పీ కె.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణానికి చెందిన సురేష్ కుమార్ అనే బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జిల్లా సైబర్‌టీం ఆర్ఎస్ఐ జునైద్, గంగారెడ్డి, కిట్టు, మహేష్ ఆధ్వర్యంలో టీమ్ ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా జార్ఖండ్ రాష్ట్రంలో ఉన్న ప్రధాన నిందితుడైన అంకిత్‌ను అరెస్టు చేశారు. నిండితున్ని పట్టుకోవడంలో కృషి చేసిన సైబర్ పోలీస్ బృందాన్ని ప్రత్యేకంగా డీఎస్పీ అభినందించారు.

మాజీ మంత్రులు హౌస్ అరెస్టు అప్రజాస్వామ్యం

- బీఆర్ఎస్ నాయకుల నిరసన


సిరిసిల్లలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రులు కేటీఆర్, హారీష్‌రావులను పోలీసులు హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామ్యం అని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. గురువారం మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులను హౌస్ అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం జిల్లా కేంద్రం నేతన్నచౌక్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలకు భారం వేస్తూ ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వినతిపత్రం ఇవ్వడానికి సిద్ధం అవుతుండగా పోలీసులు హౌస్ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర రాజధానిలో గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు రాకపోవడంతో అక్కడి ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష కట్టిందని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెంచిన బస్సు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టె శ్రీనివాస్, శివరాం, అడిచర్ల సాయి, గాజుల మహేష్, సంపత్, వెలమల శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సర్వే రికార్డులు చోరీ..

- పోలీసులకు ఫిర్యాదు చేసిన సీడీపీవో

తంగళ్లపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో సర్వే రికార్డులు చోరీకి గురయ్యాయని ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రం తాళం పగులగొట్టి బీరువాలో నుంచి సర్వే రికార్డులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఆయా భారతి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పోస్టు ఖాళీగా ఉందని బద్దనపల్లి అంగన్‌వాడీ టీచర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొంది. ఈక్రమంలో గురువారం రికార్డులు ఎత్తుకెళ్లారని ఆయా భారతి సీడీపీవోకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీడీపీవో తెలిపారు.

ఎట్టకేలకు రుద్రవరంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు మోక్షం

- 13 గ్రామాలకు మెరుగైన సేవలు


రుద్రవరంలో పూర్తి కావస్తున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

వేములవాడ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు రుద్రవరంలో సబ్ స్టేషన్ ఏర్పాట్లు మోక్షం లభించింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో వేములవాడ అర్బన్ మండలంలోని గ్రామాల ప్రజలకు విద్యుత్ సమస్య తప్పనుంది. సబ్‌స్టేషన్ పనులు వేగంగా జరుగుతుండటంతో త్వరలోనే వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చి విద్యుత్ సమస్యకు చెక్ పెట్టేందుకు అధికారులు చూస్తున్నారు. వేమలవాడ మండలంలోని రుద్రవరం, అనుపురం, సంకెపల్లి, ఆరెపల్లి, కొడుముంజ, చింతలఠాణ, శాభాష్‌పల్లి, నాంపల్లి, తిప్పాపూర్, మారుపాక, గుర్రంవానిపల్లి, చీర్లవంచ, చంద్రగిరితో కలిపి 13 గ్రామాలకు నాంపల్లి సబ్‌స్టేషన్ సేవలందిస్తుంది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో తరచూ విద్యుత్ అంతరాయంతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు.

శరవేగంగా జరుగుతున్న సబ్‌స్టేషన్ పనులు..

వేములవాడ మండలం రుద్రవరం పాత గ్రామంలో 33/11కేవీ సబ్‌స్టేషన్ ఉండేది. మధ్యమానేరు జలాశయంలోకి నీరు వచ్చి చేరడంతో బ్యాక్ వాటర్‌తో సబ్‌స్టేషన్ నీటిలో మునిగిపోయింది. రుద్రవరంతో పాటు అనుపురం, ఆరెపల్లి, సంకెపల్లి గ్రామాలకు విద్యుత్ సేవలను సబ్‌స్టేషన్ అందించేది. ప్రస్తుతం సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రుద్రవరం సబ్‌స్టేషన్ నెల రోజుల్లో పూర్తి అయ్యో అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం..

- రామకిష్టాపూర్‌లో పూర్తి కావస్తున్న బ్రిడ్జి నిర్మాణం - హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు


నిర్మాణంలో ఉన్న రామకిష్టాపూర్ బ్రిడ్జి

రుద్రంగి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలోని రామకిష్టాపూర్ వద్దగల ఒర్రెపైన వంతెన లేకపోడంలో ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడే వారు. కొద్దిపాటి వర్షం కురిసినా ఒర్రెలో వచ్చిన వరదకు రుద్రంగి, రామకిష్టాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో రామకిష్టాపూర్‌కు రుద్రంగి గ్రామానికి సంబంధాలు తెగిపోయేవి. వర్షాకాలంలో గర్భిణులు, అనారోగ్యంబారిన పడిన వారు ఆసుపత్రికి వెళ్లాలంటే వరద నీటిలో తీవ్ర తంటాలు పడేవారు. రామకిష్టాపూర్‌కు చెందిన విద్యార్థులు పాఠశాల, కళాశాలకు వెళ్లేందుకు, రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఒర్రెపైన బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో రూ.62 లక్షలు నిధులు మంజూరుచేయించి పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభమై శరవేగంగా కొనసాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే తమ కష్టాలు తీరనున్నాయని రామకిష్టాపూర్ ప్రజల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బ్రిడ్జి నిర్మాణంతో తీరనున్న కష్టాలు..

- ఈర్నం నవీన్, రామకిష్టాపూర్



బ్రిడ్జి నిర్మాణంతో రామకిష్టాపూర్ ప్రజల కష్టాలు తీరనున్నాయి. ఒర్రెపైన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అడిగిన వెంటనే రూ.62 లక్షల నిధు లు మంజూరు చేయించినందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాం. అలాగే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే రామకిష్టాపూర్, రుద్రంగి గ్రామాల మధ్య రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్


వేములవాడలో ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్


చందుర్తిలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

వేములవాడ టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఆదేశాలతో జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరిత తెలిపారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో వేములవాడ అర్బన్, రూరల్ నామినేషన్ స్వీకరణకు చేసిన ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సెప్టెంబరు 29వ తేదిన షెడ్యూల్ విడుదల చేశారని వెల్లడించారు. ఇందులో భాగంగా జిల్లాలో మొదటి విడతలో ఏడు జడ్పీటీసీ స్థానాలు, 65 ఎంపిటీసీ స్థానాలకు నామినేషన్ స్వీకరిస్తామని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయాల్లో నామినేషన్ స్వీకరణకు ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లు, ఇతర ఏర్పాట్లను పరిశీలించామని వివరించారు. ఇప్పటికే ఎన్నికల నేపథ్యంలో ఆర్‌వో, ఏఆర్‌వోలకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, జోనల్, మండల ఆఫీసర్లు, ఎంసీసీ నోడల్ ఆఫీసర్లు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీములను నియమించి శిక్షణ పూర్తిచేశామని పేర్కొన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీములు విధులు నిర్వర్తిస్తున్నాయని తెలిపారు. అన్ని ఆర్‌వో కార్యాలయాల్లో ఎన్నికల్లో ఎటీ చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, ఎన్నికకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో పెట్టాలని, నామినేషన్ స్వీకరణ ఇతర వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు జిల్లాలో రెండు, మూడో విడతల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. ఆమె వెంట ఆర్డీవో రాధాబాయి ఎంపీడీవోలు తహసీల్దార్‌లు ఉన్నారు.

● చందుర్తి : రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరిత తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడారు. ఆమె వెంట వేములవాడ ఆర్డీవో రాధాబాయి, ఎంపీడీవో రాధా ఎంపీవో తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సంస్థ ఎన్నికల నామినేషన్ స్వీకరణకు చేసిన ఏర్పాట్లను కలెక్టర్ హరిత గురువారం పరిశీలించారు. ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాదాబాయి, తహసీల్దార్ పుష్పలత, ఏంపీడీవో నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు..


మంగళపల్లిలో స్తంభానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

కోనరావుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగా మారాయి. మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడం వల్ల 28 గ్రామపంచాయతీలుగా ఏర్పడ్డాయి. కొన్ని తండాలు మినహా సుమారు అన్ని గ్రామాల్లో పోలీసులు సీసీ కెమెరాలు విద్యుత్ స్తంభాలకు ప్రధాన కూడలిలో ఏర్పాటు చేశారు. కోనరావుపేట, మామిడిపల్లి, ధర్మారం, కొలనూరు, వెంకట్రావుపేట, బావుసాయిపేట, కొండాపూర్, మల్కపేట తదితర గ్రామాల్లో పోలీసులు నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో దొంగతనాలను ఛేదించడానికి పోలీసులకు కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పనిచేయని సీసీ కెమెరాలకు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో పని చేయడం లేదని, వాటిని రిపేర్ చేయిస్తామని ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.